సాక్షి
జనగామ
మంగళవారం । 13 । జూన్ । 2023



నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, ఒకేష నల్ కోర్సుల్లో 2వ, 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి.

- 8లో▸



దేశాన్ని ముందుకు నడిపించేది వ్యవసాయమే..

దేశాన్ని ముందుకు నడిపించేది కేవలం వ్యవసా యమేనని సీజీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39^0 / 29^0

ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగానే ఉం టాయి. రాత్రి పూట ఉక్కపోత పెరుగుతుంది.

జఫర్‌గఢ్ : బడి గంట మోగిస్తున్న హెచ్‌ఎం సురేష్



తరిగొప్పుల : ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు



జనగామ రూరల్: వడ్లకొండలో విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న సర్పంచ్



హాజరు 20శాతమే..

- తెరుచుకున్న పాఠశాలలు
- తరగతి గదుల్లోనే సిమెంటు బస్తాలు
- ఆవరణల్లో ఎక్కడి చెత్త అక్కడే
- బడిగంట మోగించిన హెచ్‌ఎంలు..
- వరండాలు ఊడ్చిన ఓఎస్‌లు

జనగామ : వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. 48 రోజుల పాటు ఆడి, పాడి ఎంజాయ్ చేసిన పిల్లలు.. భుజాన బ్యాగులు వేసుకుని బడిబాట పట్టారు. మృగశిర కార్తె దాటి నాలుగు రోజులు గడిచినా.. ఎండలు దంచికొడుతుండడంతో ఇళ్ల నుంచి బయ టకు రావడానికి జనం జంకుతున్నారు. ఉదయం 8 గంటలకే సూరీడు మండుతుండడంతో పిల్లలు భారంగా బడికి బయలుదేరారు. ఓ వైపు ఎండలు.. మరో వైపు నవమి ఎఫెక్ట్‌తో జిల్లా వ్యాప్తంగా సర్కా రు స్కూళ్లలో మొదటి రోజు విద్యార్థుల హాజరు 20శాతమే నమోదైంది.



రఘునాథపల్లి: మండలగూడెంలో విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 508 ఉండ గా.. 28వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటు న్నారు. ఇటీవల నిర్వహించిన 'బడిబాట'లో కొత్త గా 3,310 మంది విద్యార్థులు చేరగా.. వారు ఇంకా అడ్మిషన్ తీసుకోవాల్సి ఉంది. 2023–24 విద్యా సం వత్సరం ప్రారంభమైన మొదటి రోజు చాలా స్కూళ్లు విద్యార్థులు లేక బోసిపోగా.. కొన్ని స్కూళ్ల లో సందడి వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయు లు విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. సుమారు నెలన్నర పాటు మూసి వేసి ఉండడంతో.. స్కూళ్ల తరగతి గదులు దుమ్ము, ధూళితో, ఆవరణ ప్రదేశాలు చెత్తతో దర్శనమిచ్చాయి. స్వీపర్లు లేక అటెండర్లు వరండాలను క్లీన్ చేయగా.. చాలా చోట్ల టీచర్లు, హెచ్‌ఎంలు బడి గంట మోగించారు.

ఓవైపు ఎండలు..
మరోవైపు నవమి ఎఫెక్ట్

బడుల పునఃప్రారంభం రోజు తీవ్రమైన ఎండ.. మరో వైపు నవమి సెంటిమెంట్ కారణంగా పిల్లలను స్కూల్‌కు పంపించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల ల్లో 28వేల మంది విద్యార్థులు ఉండగా.. తొలిరోజు 6,396 మంది మాత్రమే హాజరయ్యారు. నేడు మం గళవారం కావడంతో ఈనెల14వ తేదీ బుధవారం నుంచి విద్యార్థులు పూర్తి స్థాయిలో హాజరయ్యే అవ కాశం ఉంది. 10 మంది ఉపాధ్యాయులు మెడికల్ లీవ్‌లో ఉన్న కారణంగా మొదటి రోజు విధులకు హాజరుకాలేక పోయారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : వరండాలో విద్యార్థులు



లింగాలఘణపురం : విద్యార్థులు లేక బోసిపోయి..

మొదటి రోజు ముఖచిత్రం

- జనగామ పట్టణం రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతి గదిలో సిమెంటు బస్తాలు, వంట సామగ్రి దర్శన మిచ్చాయి.
- స్టేషన్‌ఘనపూర్ మండల పరిధిలో పది శాతం విద్యార్థులు కూడా హాజరు కాలేదు. చిల్పూరు మండలం మల్కాపూర్ హైస్కూల్‌లో 220 మంది విద్యార్థులకు 25 మందే వచ్చారు.
- లింగాలఘణపురం పరిధి స్కూళ్లలో ఉపాధ్యా యులంతా హాజరుకాగా 2,437 మంది విద్యా ర్థులకు 454(18శాతం) మంది వచ్చారు.
- రఘునాథపల్లి మండలంలో 3,571 మందికి 1,500 మంది హాజరయ్యారు. మండలగూ డెం హైస్కూల్ హెచ్‌ఎం భారత రవీందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. ఇబ్రహీంపూర్ పీఎస్‌లో మిషన్ భగీరథ ట్యాప్‌కు ఆన్ ఆఫ్ లేక నీరంతా వృ థాగా పోతూ కనిపించింది.
- జఫర్‌గఢ్ మండలంలో 3,025 మంది విద్యార్థులకు 558 మంది మాత్రమే హాజర య్యారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో స్వీపర్ లేక అటెండర్ పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. ప్రాథమిక పాఠశాలలో హెచ్ ఎం సురేష్ బడిగంట మోగించి విద్యార్థులతో ప్రార్థన చేయించారు.
- జనగామ మండలం వడ్లకొండ ఉన్నత పాఠ శాలలో 85 మందికి 34 మంది హాజరయ్యా రు. సర్పంచ్ బొల్లం శారద ఆధ్వర్యంలో పిల్ల లకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.
- తరిగొప్పుల మండలంలో 214 మందికి 16 మందే వచ్చారు. వెల్దండ పీఎస్‌లో 131 మం దికి ఇద్దరు, వెల్దండ హైస్కూల్‌లో 83 మంది విద్యార్థులకు 9 మంది హాజరయ్యారు. పలు పాఠశాలలను జీపీ కార్మికులు శుభ్రం చేశారు.



వెల్దండ పీఎస్‌లో ఇద్దరే విద్యార్థులు



జనగామ: రైల్వేస్టేషన్ ఏరియా హైస్కూల్‌లో..

సెల్ ఫోన్ చిట్కా..



తరగతి గదిలో సెల్ ఫోన్ చూస్తున్న చిన్నారులు

చిల్పూరు: సెలవుల తర్వాత బడికి వచ్చిన పిల్లలు మధ్యలో ఇంటికి వెళ్లకుండా పాఠశాల హెచ్‌ఎం సెల్ ఫోన్ చిట్కా ఉపయోగించారు. లింగంపల్లి పం చాయతీ పరిధి యాపల్‌బోల్‌తండా ప్రాథమిక పాఠ శాల హెచ్‌ఎం రాజేందర్ సోమవారం పాఠశాల తెరిచారు. పిల్లలు ఎవరూ రాకపోవడంతో ఇంటిం టికీ వెళ్లి ముగ్గురు విద్యార్థులను తీసుకువచ్చారు. వారు మధ్యలో ఇంటికి వెళ్లకుండా కొద్ది సేపు చదు వు చెప్పి.. తన సెల్ ఫోన్‌లో వీడియో గేమ్ పెట్టి ఇచ్చాడు. దీంతో స్కూల్ టైం అయిపోయే వరకు విద్యార్థులు ఉన్నారు.

శ్రీచండిక అమ్మవారికి వెండి శఠగోపం బహూకరణ



అర్చకుడికి శఠగోపం అందజేస్తున్న దాతలు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో చండిక అమ్మవారికి.. పాలకుర్తికి చెంది న ఆరూరి ఈశ్వర్, నరేష్, బజ్జూరి వెంకటరమణ, లోయ పవన్ 870 గ్రాముల(రూ.65వేల విలువైన) మిశ్రమ వెండితో తయారు చేసిన శఠగోపం, ఆరివేణి సమర్పించారు. ఈ మేరకు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న సోమవారం తెలిపారు.

రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

జనగామ రూరల్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లి మెంటరీ పరీక్షలు ఈనెల 14 నుంచి ప్రారంభమవు తాయని డీఈఓ రాము ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాసే విద్యార్థులకు హను మకొండ రోడ్డులోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సెంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సమా చారం అందించి పరీక్షకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రాని క్ పరికరాలు, ఫోన్‌లు, వాచ్‌లకు అనుమతి లేదని, పరీక్షలపై సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ (6304062768)లో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో విజయం సాధించాలి



జనగామ: సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో విజయం సాధించాలని కోరుతూ తిరుమల కొండపై శ్రీవారికి మొక్కులు చెల్లించినట్లు ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి తెలిపారు. సతీమణి పద్మలతారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డితో కలిసి సోమవారం తిరుమలలో స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం తో పాటు కేసీఆర్‌కు మరింత ఉజ్వల భవిష్యత్ కల్పించాలని వేడుకున్నట్లు వెల్లడించారు.

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి



జనగామ రూరల్: వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్క రించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమ వారం జిల్లా సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ మన్సూరికు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ.. జీఓ నంబర్ 21ని గెజిట్ చేయడం తోపాటు సెక్యూరిటీ గార్డులకు ప్రమాద బీమా, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోట్ల వెంకటేష్, ప్రధాన కార్య దర్శి తాటికొండ శ్రీనివాస్, కోశాధికారి బత్తిని వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు సాదం కుమార స్వామి, కిషన్, ప్రవీణ్, రవీందర్, సారంగపా ణి, లక్ష్మయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.

ఎస్సై సృజన్‌పై డీజీపీకి ఫిర్యాదు

జనగామ: జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు విషయమై ఎస్సై సృజన్ తన కొడుకును బెది రింపులకు గురిచేశాడని జిల్లా కేంద్రానికి చెంది న గండి నాగరాజు సోమవారం హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు అఖిల్‌పై చేయని నేరాన్ని మోపి రూ.30,000 చెల్లించాల్సిందిగా ఎస్సై ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, విచారణ చేప ట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరా డు. ఈ విషయమై ఎస్సై సృజన్‌ను వివరణ కోరగా బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అఖిల్ ను స్టేషన్‌కు పిలిపించి విచారించామే తప్ప బెదిరింపులకు పాల్పడలేదన్నారు.

'కటకం' అమరత్వం విప్లవోద్యమానికి తీరనిలోటు

దేవరుప్పుల : మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ అమరత్వం భారత దేశ విప్లవోద్యమానికి తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు–లెనినిస్టు) రెవెల్యూషనరీ ఇనిషియేటివ్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగున్నర దశాబ్దాలకు పైగా నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి శ్వాస వరకు పనిచేశారన్నారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంత, రాజకీయ, కార్యాచరణతో తమకు విభేదాలున్న ప్పటికీ దేశంలో కాషాయ, కార్పొరేట్, మనువా ద, ఫాసిస్టు బీజేపీ(ఆరెస్సెస్) ప్రభుత్వం కార్మి క, ప్రజావ్యతిరేక నిర్బంధ పూరిత పాలనకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఫ్రంట్ కడుతూ.. ఆనం ద్ ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు.

కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక



జనగామ: జనగామ మున్సిపల్ శానిటేషన్ కాం ట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున లింగయ్య కమిటీని ధ్రువీకరించారు. గౌరవ అధ్యక్షుడిగా మల్లిగారి రాజు, వర్కింగ్ ప్రెసిడెం ట్ వేముల నర్సింగం, అధ్యక్షుడు జి.మల్లేష్, ప్రధాన కార్యదర్శి తిప్పారపు ప్రసాద్, కోశాధి కారి పులి శ్రీను, ఉపాధ్యక్షులు కొయ్యడ వెంకట స్వామి. గడిపె ప్రవీణ్, నాగిళ్ల నాగరాజు, ముఖ్య సలహాదారులు రొడ్డ కృష్ణ, తాళ్లపల్లి ఎల్లేష్, వాతాల యాదగిరి, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా ఆర్.దేవేంద్ర, కార్యవర్గ సభ్యులు గా తిప్పారపు ఎల్లమ్మ, కంటి విజయ, కోమ లత, రేణుకను ఎన్నుకున్నారు.

కుసుమానికి కన్నీటి వీడ్కోలు

బీఆర్‌ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అంత్యక్రియలు సోమవారం తన స్వగ్రామమైన మల్లంపల్లిలో జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌తోపాటు పలువురు మంత్రులు హాజరై కన్నీటితో నివాళులర్పించారు. కేటీఆర్ జగదీశ్ పార్థివ దేహంపై బీఆర్‌ఎస్ జెండా కప్పి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

- ములుగు



జగదీశ్ పార్థివ దేహంపై బీఆర్‌ఎస్ జెండా కప్పి నివాళులర్పిస్తున్న కేటీఆర్, కడియం, తదితరులు



జగదీశ్ పార్థివ దేహం వద్ద నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి కేటీఆర్

- పూర్తి వివరాలు 8లో▸

పాడి రైతుల బలోపేతానికి రుణాలు

సమాఖ్య చైర్మన్ సోమ భరత్‌కుమార్

జనగామ రూరల్: పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో అం దించే ముద్ర రుణాలు సద్వినియోగం చేసుకోవాల ని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని విజయ పాలడెయిరీ కేంద్రంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్‌తో కలిసి ఫీల్డ్ ఆఫీసర్ల సమావేశంలో మాట్లాడారు. పాడి రైతులకు 'ముద్ర' పథకం కింద రూ.1 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందిస్తామని, జిల్లాలో సుమారు 300 మందికి అవకాశం ఉందని చెప్పా రు. కేవైసీ, సర్టిఫికెట్లు, సిబిల్ స్కోర్ చెక్ చేసి రుణం మంజూరు చేస్తామన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ధన్‌రా జ్, చైర్మన్ సోమిరెడ్డి, సొసైటీ చైర్మన్‌లు, సూపర్‌వైజ ర్లు, పాడి రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 46 మంది గైర్హాజరు

జనగామ రూరల్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో జరిగిన ఈ పరీక్షలకు జనరల్ విభాగంలో 920 మందికి 29, ఒకేషనల్ విభాగంలో 218 మందికి 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఓ శ్రీనివాస్ తెలిపారు.

డబ్ల్యూఎంటీపీలో ఉద్యోగాల కల్పన

- 17న కొడకండ్లకు మంత్రి కేటీఆర్
- మినీ టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన
- సమీక్ష సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ : వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కు(డ బ్ల్యూఎంటీపీ)లో ఆగస్టు నుంచి ఉద్యోగాల కల్పన కు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి ఎర్ర బెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారు లు, టెక్స్‌టైల్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించి న సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల కేంద్రంలో మినీ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేయడానికి ఐటీ, పరిశ్రమలు, చేనేత, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కేటీఆర్ రానున్నట్లు వెల్లడించారు. చేనేత కార్మికులు అధికంగా ఉన్న కొడకండ్ల పరిసర ప్రాంతాల వారికి ఉపాధి కల్పించ డానికి సిరిసిల్ల తరహాలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పించగా.. మంత్రి కేటీఆర్ నెరవేర్చడం సంతోషంగా ఉంద న్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు సహకారంతో 3 వేల మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడమే కాకుండా ప్రభు త్వం నుంచి ఉచితంగా మిషన్లను పంపిణీ చేశామని చెప్పారు. వీరికి ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు నుం చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణ యించినట్లు మంత్రి వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టెక్స్‌టైల్ విభాగం కమిషనర్ బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ మెహర్, యంగ్ ఇండియా, కైటెక్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

ఎన్‌ఐఎఫ్‌డీలో డిజైనింగ్ కోర్సులు

- 25న స్కాలర్‌షిప్ మెరిట్ పరీక్ష

జనగామ: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజై నింగ్ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి ఉన్నవారు దరఖా స్తు చేసుకోవచ్చని ఎన్‌ఐఎఫ్‌డీ సంస్థ డైరెక్టర్ రాము యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధి అవ కాశాలకు సంబంధించి ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీ రియర్ డిజైనింగ్, ఫొటోగ్రఫీ, గ్రాఫిక్ డిజైనింగ్ వం టి వృత్తి విద్యా డిప్లొమా, డిగ్రీ, అడ్వాన్స్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్ ద్వారా ఫీజులో రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు ల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నా యని, అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 25న స్కాలర్‌షిప్ టెస్ట్ ఉంటుందని, టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యా ర్హతలు ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరా లకు 9849167839 / 9030610033 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

జనగామ రూరల్: విదేశాల్లో ఉద్యోగం చేయాలను కునే వారికి టామ్‌కామ్ కంపెనీ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా, యూకేలో అవకాశాలున్నాయని, అర్హత కలిగిన నర్సింగ్ ఇతర ఆరోగ్య సంరక్షకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6302292450 / 7893566493 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తెలంగాణలో సంక్షేమ సంబురం



2కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

- 2కే రన్‌లో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య
- రైల్వేస్టేషన్ నుంచి బతుకమ్మకుంట వరకు రన్

జనగామ: కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో దశాబ్ది ఉత్సవాల పేరిట సంక్షేమ సంబురాలు జరు పుకోవడం మనందరి అదృష్టంగా భావించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. రాష్ట్ర అవత రణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమ వారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ నుంచి బతుకమ్మకుంట వరకు చేపట్టిన 2కే రన్‌ను డీసీపీ పి.సీతారాం, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశా య్, రోహిత్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జము నలింగయ్యతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం బతుకమ్మకుంటలో ఏర్పాటు చేసిన వేదిక నుంచి ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు బతుకమ్మ కుంట లో శాంతికి చిహ్నంగా బెలూన్లను వదిలి వేడుకల ను ప్రారంభించారు. తెలంగాణ పాటలకు అధికా రులు, పోలీసులు, యువత స్టెప్పులేశారు. రన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బచ్చన్నపేట, తరిగొప్పు లకు చెందిన ఎం.క్రాంతి, ఎన్.క్రాంతి, చందు తదితరులకు బహుమతులు అందజేశారు. రన్‌లో పాల్గొన్న వారికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో టీషర్టు లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ దేవేంద ర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఎస్సైలు సృజ న్, రుక్మాచారి, అరుణ్, నవీన్, నరేష్, అనిల్, కలెక్ట రేట్ ఏఓ మన్సూరీ, వివిధ శాఖల జిల్లా అధికారు లు వసంత, వినోద్‌కుమార్, గోపాల్‌రావు, ఇస్మా యిల్, కేఆర్.లత, మున్సిపల్ కమిషనర్ రజిత, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, అనిత, మసిఉర్ రెహమాన్, ఎంపీపీ మేకల కలింగరాజు, నారోజు రామేశ్వరాచారి, మల్లిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న కలెక్టర్, డీసీపీ, అదనపు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు

5 రోజులు వ్యవసాయ మార్కెట్ బంద్



వరంగల్ : వరంగల్ ఏనుమాముల మార్కెట్ ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు 5 రోజులు బంద్ ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా గుమస్తా, హమాలీల విజ్ఞప్తి మేరకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ – ఇండస్ట్రీస్ లేఖతో బుధ, గురు, శుక్ర వారాల్లో సెలవులు ప్రకటిస్తున్నామన్నారు. 17వ తేదీ శనివారం యార్డు బంద్, 18వ తేదీ ఆదివారం వారాంతపు సెలవులతో మొత్తం ఐదురోజులు మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. 19వ తేదీన మార్కెట్ పునఃప్రారంభం అవుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని కోరారు.



ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న యాదవరెడ్డి, కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే పెద్ది, చెరుకు సుధాకర్, ఎమ్మెల్సీలు కడియం, సారయ్య, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యే సీతక్క, ఎంపీ దయాకర్

కుసుమానికి కన్నీటి వీడ్కోలు

అశ్రునయనాలతో ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు

- చివరి చూపునకు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- పార్థివదేహంపై బీఆర్‌ఎస్ జెండాకప్పిన మంత్రి కేటీఆర్
- కుటుంబ సభ్యులకు ఓదార్పు.. అండగా ఉంటామని హామీ
- పాడె మోసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- జనసంద్రంగా మారిన మల్లంపల్లి



అంతిమ యాత్రకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రజలు

ములుగు: బీఆర్‌ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్‌కు సోమవారం అభిమానులు, పార్టీ కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మల్లంపల్లి జనసంద్రమైంది. జగదీశ్ ఆదివారం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆస్పత్రినుంచి ఆయన పార్థివదేహాన్ని తన స్వగ్రామమైన మల్లంపల్లికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఆయన చేసిన మేలును గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

అధికార లాంఛనాలతో..

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో కుసుమ జగదీశ్ అంత్యక్రియలు నిర్వహించారు. పోలీస్ శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది. సుమారు గంటపాటు జరిగిన అంతిమయాత్రలో ఎండను సైతం లెక్కచేయకుండా అభిమానగణం పాల్గొంది. కుమారుడు వెంకట సత్యదేవ్ కుండపట్టారు. మధ్యాహ్నం 12: 35 గంటల సమయంలో స్థానిక వారి సొంతభూమిలో సంప్రదాయబద్ధంగా ఖననం చేశారు.

హాజరైన మంత్రి కేటీఆర్

రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సోమవారం ఉదయం జగదీశ్ అంత్యక్రియలకు హాజరయ్యారు. బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌తోపాటు ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎంపీ రంజిత్ కుమార్ రెడ్డితో కలిసి వచ్చారు. జగదీశ్ భౌతికకాయంపై బీఆర్‌ఎస్ జెండా కప్పారు. పూలమాల వేసి నివాళులర్పించారు. పక్కనే ఉన్న తల్లి సులోచన, భార్య రమాదేవి, కుమార్తె హరిచందన, కుమారుడు సత్యదేవ్‌లు కేటీఆర్‌ను చూసి బోరున విలపించారు. దీంతో వారిని దగ్గరికి తీసుకొని ఓదార్చారు.

జనసంద్రంగా.. అంతిమయాత్ర

జగదీశ్ అంతిమయాత్ర జనయాత్రగా మారింది. ములుగు జిల్లాతోపాటు ఉమ్మడి వరంగల్, హైదరాబాద్, నల్లగొండ, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులతో ములుగు, నర్సంపేట దారి కిక్కిరిసిపోయింది. మల్లంపల్లిలో చదువుకున్న 1991వ బ్యాచ్ మిత్రులు హాజరై జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎస్పీ గాష్‌ఆలం ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన దారిని వన్ వేగా మార్చారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల వాహనాలను మాత్రమే అనుమతించారు. జగదీశ్‌తో ఉన్న సన్నిహితంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత సోమవారం ఉదయం నుంచి అంత్యక్రియల ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. అంతకుముందు మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాడె మోసి అభిమానం చాటుకున్నారు.



జగదీశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్



జగదీశ్ తల్లిని ఓదార్చుతున్న మంత్రి ఎర్రబెల్లి

ఆత్మీయ సోదరుడిని కోల్పోయా : కేటీఆర్

రెండు దశాబ్దాలపాటు సీఎం కేసీఆర్‌తోపాటు ఉద్యమంలో నిలిచి ఉత్తముడిగా ఉన్నాడు. నాకు ఆత్మీయ సోదరుడిగా ఉన్న జగదీశ్‌ను కోల్పోవడం బాధగా ఉంది. సీఎం ఏ పని చెప్పిన వెనుకడుగు వేయకుండా చేశాడు. చిన్న వయసులోనే మృతిచెందడం బాధాకరం. ప్రభుత్వం తరపున కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం.

ప్రముఖుల నివాళి

జగదీశ్ పార్థివదేహాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, పువ్వాడ అజయ్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, విప్ ప్రభాకర్‌రావు, స్థానిక ఎమ్మెల్యే సీతక్క, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్, బానోత్ శంకర్ నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ, రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజ్ సారయ్య, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, వరంగల్, మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్స్ గండ్ర జ్యోతి, ఆంగోత్ బిందు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్‌రావు, రెడ్‌కో చైర్మన్ యారువ సతీ ష్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణ మోహన్‌రావు, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బు చ్చయ్య, హనుమకొండ, ములుగు గ్రంథాల య సంస్థ చైర్మన్‌లు అజీజ్ ఖాన్, గోవింద్ నాయక్, జెడ్పీటీసీలు సకినాల భవాని, రుద్రమాదేవి, తుమ్మల హరిబాబు, ఎంపీపీ శ్రీదేవి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, అధికారులు ఉన్నారు.

నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- హాజరుకానున్న 1,81,286 మంది విద్యార్థులు
- 131 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, బీఎల్‌బీ, ఒకేషనల్ కోర్సుల్లో 2వ , 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ సోమవారం తెలిపారు. రెండో సెమిస్టర్‌కు 71,204 మంది, 4వ సెమిస్టర్‌లో 64,900 మంది, 6వ సెమిస్టర్‌లో 45,182 మంది విద్యార్థులు మొత్తం 1,81, 86 మంది పరీక్షలు రాయబోతున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 48 , ఆదిలాబాద్ జిల్లాలో 50, ఖమ్మం జిల్లాలో 33 మొత్తం 131 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. 4వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14,16, 19, 21, 23, 25, 28, జూలై 3, 5, 7వ తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. 6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4, 6,10, 11, 12, 13, 14 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని వారు తెలిపారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ దుర్మరణం..

- వరంగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



సుమతి (ఫైల్)

ఖిలా వరంగల్: మరో రెండు అడుగులు వేస్తే ఇంట్లోకి క్షేమంగా చేరుకునే వారు.. ఆ లోపే ఆ దంపతులను మృత్యువు వెంటాడింది. ఆటో దిగి రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా వస్తున్న క్రేన్ వెహికల్ వారిని ఢీకొంది. దీంతో భార్య అక్కడికక్కడే దుర్మరణం చెందగా భర్త తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు . ఈ హృదయ విదారక ఘటన పలువురిని కంటతడికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే వరంగల్ ఫోర్ట్ రోడ్డు విద్యానగర్ కాలనీకి చెందిన కాలువ సుమతి (82) , బాలరాజు (82) దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి సోమవారం ఉదయం 5గంటలకు వరంగల్‌కు చేరుకున్నారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో ఆటో ఎక్కి ఇంటికి బయల్దేరారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని సాయిబాబా గుడి కమాన్ సమీపంలో ఆటో దిగి రోడ్డు క్రాస్ చేస్తుండగా వరంగల్ నుంచి వేగంగా వస్తున్న క్రేన్ వెహికల్ వారిని ఢీకొంది. దీంతో సుమతి అక్కడికక్కడే దుర్మరణం చెందగా బాలరాజు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాలరాజును 108లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారని బంధువులు తెలిపారు. ఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో విద్యానగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అశ్రునయనాల మధ్య భవ్య అంత్యక్రియలు

- జిల్లేడు చెట్టుకు పెళ్లి.. అనంతరం దహన సంస్కారాలు
- గ్రామంలో మిన్నంటిన రోదనలు
- ముగ్గురిపై కేసు నమోదు




భవ్య అంతిమయాత్రలో గ్రామస్తులు

కురవి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడం.. పెద్దలు పంచాయితీ చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన బీటెక్ విద్యార్థిని సాతర్ల భవ్య అంత్యక్రియలు సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామంలో భవ్యకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. పోస్టుమార్టం అనంతరం భవ్య మృతదేహాన్ని పోలీసుల భారీ బందోబస్తు మధ్య గ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం భవ్యకు, జిల్లేడు చెట్టుకు పెళ్లి చేశారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. అనంతరం భవ్య మృతదేహాన్ని శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. కాగా, మృతురాలి తల్లి ఉమ ఫిర్యాదు మేరకు ప్రియుడు రుద్రారపు వినయ్, అతడి తల్లిదండ్రులు శ్రీనివాస్, సుభద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు.

భార్య, పాపను చూసేందుకు వెళ్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



యాకాంబ్రం (ఫైల్)

నెక్కొండ/ కేసముద్రం : తనకు మరో మహాలక్ష్మి జన్మించిందనే సంతోషంతో ఓ వ్యక్తి.. బైక్‌పై భార్య, పాపను చూసేందుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో అతనిని కబలించింది. ఈ ఘటన సోమవారం నెక్కొండ మండల కేంద్రంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం (స్టేషన్)లోని కిష్టాపురానికి చెందిన మందాటి యాకాంబ్రం (37) కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. 9 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన లావణ్యను కులాంతర వివాహం చేసుకోగా ఆ దంపతులకు కూతురు ఆద్వేక్ష అరణ్య ఉంది. ఈ క్రమంలో ఈ నెల 11న వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిలో రెండో సంతానంగా పాప జన్మనించింది. ఈ విషయం తెలుసుకున్న యాకాంబ్రం అదే రోజు రాత్రి తన భార్య, పాపను చూసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అప్పల్‌రావుపేట– నెక్కొండ రహదారి వద్ద చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తుమని ఎస్సై జానీపాషా తెలిపారు. కాగా, యాకాంబ్రం తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేశారు. 2011 ఫిబ్రవరి 22, 23 తేదీలలో 48 గంటల రైల్ రోకో చేపట్టారు. ఈ సమయంలో మణుగూరు ప్యాసింజర్‌కు నిప్పు పెట్టిన ఘటనలో యాకాంబ్రం ప్రధాన నిందితుడు. కాగా, ఎమ్మెల్యే శంకర్‌నాయక్.. యాకాంబ్రం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యాకాంబ్రం పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

దేశాన్ని ముందుకు నడిపించేది వ్యవసాయమే..

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ
- తాళ్లపూసపల్లిలో రైతు శిక్షణ శిబిరం



రైతులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న సీబీఐ మాజీ జేడీ


కేసముద్రం: దేశాన్ని ముందుకు నడిపించేది కేవలం వ్యవసాయమేనని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపూసపల్లిలో రైతు జైపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఎన్‌డ్రాపోడ్, ఆదిగురు భారత సంఘం, అరబిందో ఫార్మా ఫౌండేషన్, జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ పంటలు–గో ఆధారిత వ్యవసాయంపై రైతు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశంలోని ప్రజలు, వలసలు వచ్చిన వారికి ఆహారాన్ని అందించింది వ్యవసాయమేనన్నారు. గతంలో అమెరికా నుంచి పడవ వస్తేనే మనకు ఆహారమని, కాని ఇప్పుడు మనదేశం ప్రపంచంలోని 70 దేశాలకు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ చెప్పారని, అంటే మన దేశం ఏ స్థాయిలో ఉందనేది అర్థమవుతుందన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారంగా గిట్టుబా టు ధరను, పంట భీమాను ప్రభుత్వాలు అందించాలన్నా రు. రాజమండ్రిలోని ధర్మవరంలో తాను 12 ఎకరాల భూ మిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నానని, రైతుల కష్టాలు తనకు తెలుసన్నారు. ప్రకృతిసాగును క్రమక్రమంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్కగానుగ నూనె యంత్రాన్ని ప్రారంభించారు. సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న రైతులను సన్మానించారు. కేవీకే కోఆర్డినేటర్ మాలతి, జేవీఆర్‌హెచ్‌ఆర్ భాస్కర్, వెంకట్రాంరెడ్డి, రమేష్, రైతులు పాల్గొన్నారు.

నూకశాతం అధికంగా ఉండే ధాన్యం తీసుకోం

- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌కుమార్

న్యూశాయంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రార్రైస్ ఎఫ్‌సీఐ ద్వారా మాత్రమే సేకరిస్తున్న నేపథ్యంలో అధిక నూక శాతం కలిగిన 1001 ధాన్యాన్ని భవిష్యత్‌లో దిగుమతి చేసుకోబోమని వరంగల్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రకం ధాన్యాన్ని తాము సేకరిస్తే ఎఫ్‌సీఐ తిరస్కరిస్తోందన్నారు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన లక్షకు పైగా టన్నుల ధాన్యం నిల్వలు మిల్లుల లోనే పేరుకుపోయాయన్నారు. దీంతో మిల్లర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదన్నారు. తమ బాధను అర్థం చేసుకుని రైతులు 2023–24 ఖరీఫ్ సీజన్‌లో 1001 రకం వరి సాగు చేపట్టొదన్నారు. వానాకాలంలో ఎంటీయూ, ఎంటీయూ1061, ఆర్‌ఎన్‌ఆర్, హెచ్‌ఎంటీ, సోనా, బీపీటీ, 5204, స్వర్ణ తదితర రకాలను పండించాలని సూచించారు. అలాగే, వ్యాపారులు కూడా 1001 రకం విత్తనాలు విక్రయించకుండా తమకు సహకరించాలన్నారు.

నిట్‌లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : దేశంలోనే తొలిసారి నిట్ వరంగల్‌లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో ఎంటెక్ కోర్సును ప్రారంభించినట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ సెమినార్ హాల్‌లో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్టీ) యాక్సలరేటెడ్ విజ్ఞాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా 'మెటీరియల్ సైన్స్ అండ్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన హై ఎండ్ రీసెర్చ్ ట్రైనింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిట్ వరంగల్‌లో మెటల్ త్రీడీ ప్రింటింగ్ అందుబాటులో ఉందని, నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌తో నిట్ ఎంఓయూ కుదుర్చుకుందని తెలిపారు. నిట్ వరంగల్ బెంగుళూరులోని సీఎంటీఐ సౌజన్యంతో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్ కోర్సును ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్ ,సీజీసీఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ వంశీకృష్ణ, బెంగుళూరు జీఈ ఏవియేషన్స్ ప్రొఫెసర్ ఉమామహేశ్వర్, మంజయ్య, రవికుమార్, ఆడెపు కుమార్, సురేశ్‌బాబు, రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఈ మాస్ట్‌ల తరలింపు..



కాజీపేట నుంచి వాహనాల్లో తరలుతున్న ఆర్‌ఈ మాస్ట్‌లు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు 3వ లైన్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ ఏర్పాటు కోసం ఆర్‌ఈ మాస్ట్‌లు కాజీపేట జంక్షన్ నుంచి (3వ లైన్ నిర్మాణం పూర్తయిన తర్వాత ట్రాక్‌కు పక్కన ఏర్పాటు చేసే విద్యుత్ స్తంభం) తరలిస్తున్నారు. కాజీపేట–బల్లార్షా, కాజీపేట–విజయవాడ మార్గాలలో 3వ లైన్ నిర్మాణంలో భాగంగా ఓహెచ్‌ఈ విద్యుత్ విభాగానికి సంబంధించిన ఆర్‌ఈ మాస్ట్‌లను భారీ వాహనాలలో ఆయా రూట్‌లకు తరలిస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాగా, ఈ ఆర్‌ఈ మాస్ట్‌లు ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్ విభాగం అధికారులు ఓహెచ్‌ఈ విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన అనంతరం రైళ్ల ట్రాఫిక్ కొనసాగుతుందని తెలిపారు. కాగా, భారీ వాహనాలలో తరలిస్తున్న ఈ ఆర్‌ఈ మాస్ట్‌లను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.